# నీకో న్యాయం - నాకో న్యాయమా?

- కాకాని కమల

సాయంత్రం ఆరుగంటలు కావస్తోంది.

సుహాసిని ఇంకా ఆఫీసులోనే వుంది. దాదాపు స్టాఫ్ అంతా వెళ్లిపోయారు. ఒకరిద్దరు మాత్రం పనిచూసుకుంటున్నారు.

"సుహాసినిగారూ!"

తల దించుకుని ఫైల్స్ చూసుకుంటున్న సుహాసిని తల ఎత్తింది.

ఎదురుగా చంద్రకాంత్.

"ఏంటి ఇంకా ఆఫీసులోనే వున్నారు?" అన్నాడు చొరవగా ఆమె ఎదురు కుర్చీలో కూర్చుంటూ.

"అవునండీ. కిందటివారంలో నాలుగు సెలవులు పెట్టాను. ఆ పెండింగ్ వర్క్ వుండిపోయింది. అది క్లియర్ చేయాలని కూర్చున్నాను. నిన్ననే మేనేజరుగారు పిలిచి చెప్పారు కూడాను" అంది.

"మరి మీరు ఆలస్యంగా ఇంటికి వెళితే మీ అమ్మగారు కంగారువడరా?"

"చెప్పే వచ్చానండీ రెండుమూడురోజులు ఆలస్యంగా వస్తానని. అవసరం అయితే మళ్లీ సెలవు పెట్టాల్సి వస్తుందేమో" అంది.

"అలాగా! చీటికీ మాటికీ సెలవు పెడుతున్నారు?"

"మా అమ్మ ఆరోగ్యం సరిగా లేదండీ. డాక్టర్‌కి చూపిస్తే చాలా పరీక్షలు చేయాలి అంటున్నారు. ఆ పనిమీద సెలవు పెట్టాను. రిపోర్ట్ చూసి ఆపరేషన్ చేయాలని చెబితే మళ్లీ సెలవు పెట్టాల్సి రావచ్చు. అందుకే ముందు పెండింగ్ వర్క్ పూర్తి చేస్తున్నాను"

"అయితే ఇప్పుడు నేను మీ పని చెడగొడుతున్నట్లే"

"అలాగేంలేదు. చెప్పండి" అంది.

"సుహాసినిగారూ! మీరు మన సెక్షన్‌కి వచ్చి ఏడాది అయింది కదూ"

"అవును"

"సుహాసినిగారూ! నేను చాలా రోజులుగా మీతో మాట్లాడాలనుకుంటున్నాను. నేను ఈ సెక్షన్‌కి వచ్చి మూడేళ్ళు అవుతోంది. నేను మా ఊరి దగ్గర బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నాను. తొందరలో ఆర్డర్స్ రావచ్చు. చాలారోజులుగా మీతో మాట్లాడాలని అనుకుంటున్నాను. మీరేం అనుకోనంటే..."

"అయ్యో ఎంత మాట చెప్పండి" అంది.

"నా పర్సనల్ విషయం గురించి. సూటిగా విషయంలోకి రమ్మంటారా?"

"వెల్‌కమ్" అంది నవ్వుతూ.

"నాకు వివాహం అయింది. నాలుగేళ్ల పాప కూడా వుంది. కొన్ని కారణాలవల్ల నా భార్య నుంచి విడిపోయాను. ప్రస్తుతం నా కూతురు మా అన్నయ్య దగ్గర వుంది. నాకు తల్లిదండ్రులు లేరు. నేను మళ్లీ పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. మీరు ఏ కారణాలవల్ల ఇంకా పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా వుంటున్నారో నాకు తెలియదు. అయినా నా అదృష్టాన్ని పరీక్షించుకోవాలన్నదే నా తపన. మీరు నాకు అన్నివిధాలా నచ్చారు. మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలని ఆశ పడుతున్నాను. నా పెళ్లి అయ్యాక మా అమ్మాయి నా దగ్గరకు వచ్చేస్తుంది. మా ఊళ్ళో నాకు పొలాలున్నాయి" చెప్పవలసినవి గబగబా చెప్పేసి రుమాలుతో ముఖం తుడుచుకున్నాడు.

అతడు అలా నేరుగా అడిగేసరికి సుహాసినికి వెంటనే ఏం జవాబు చెప్పాలో తోచలేదు. తలదించుకుని మౌనంగా ఉండిపోయింది.

అది గమనించిన చంద్రకాంత్ "తొందరేం లేదు. మీరు ఆలోచించుకుని జవాబు చెప్పండి" అని వెళ్లిపోయాడు.

సుహాసినికి ఇంక పని చేయాలనిపించలేదు. ఏదో అలజడి... ఓ గంటసేపు ఆలోచిస్తూ కూర్చుని ఇంటికి వచ్చేసింది. మళ్లీ అతను అడిగితే ఏం చెప్పాలి?

★★★

నెలరోజులు గడిచిపోయాయి.

చంద్రకాంత్, సుహాసిని నిత్యం ఆఫీసులో కల్సుకుంటూనే ఉన్నారు. ఎక్కువగా మాట్లాడుకోవడంలేదు.

ఆ రోజు స్టాఫ్ అంతా వెళ్లిపోయినా ఏదో పెండింగ్ వర్క్ వుండడంతో సుహాసిని ఆఫీసులో వుండిపోయింది.

చంద్రకాంత్ వచ్చి ఎదురుగా కూర్చున్నాడు.

"మీ పనిని నేను చెడగొట్టడంలేదుకదా" అన్నాడు.

"నో...నెవ్వర్"

మళ్లీ అతను ఏదోరోజు తన ముందుకు వస్తాడని వూహించింది. అతనికి జవాబు చెప్పడానికి కూడా సిద్ధంగా వుంది.

"సుహాసినిగారూ! ఇంతకుముందు ఒక విషయం గురించి మీ అభిప్రాయం అడిగాను. దాని గురించి ఏం ఆలోచించారు?" అన్నాడు

సుహాసిని హ్యాండ్‌బ్యాగ్‌లోంచి ఒక కవరు తీసి అతనికి అందించింది.

"ఏమిటిది?"

"తెరిచి చూడండి"

కవరు తెరిచి ఒక ఫొటో బయటకు తీసాడు. అందులో సుహాసిని మరో యువకుడు పెళ్లి దండలతో.

అదిరిపడ్డాడు చంద్రకాంత్.

"ఏమిటి? మీకు పెళ్లి అయిందా?"

"అవును. అయింది" అంది సుహాసిని.

"మరి?" అయోమయంగా చూసాడు.

"నా దురదృష్టం చంద్రకాంత్‌గారూ! మా పెళ్లి అయిన మూడునెలలకే ఆయన స్కూటర్ ఆక్సిడెంట్‌లో పోయారు. అప్పటికి నా వయసు పందొమ్మిది సంవత్సరాలు. డిగ్రీ పూర్తయింది. నేను మా తల్లిదండ్రులకి ఒక్కత్తే సంతానాన్ని. నా భర్త పోయిన సంగతి నా తల్లిదండ్రులు ఎక్కువగా ప్రచారం చేయలేదు. గోప్యంగా వుంచారు. నన్ను తీసుకుని దూరంగా వచ్చేసారు. ఆ తరువాత నేను చదువుకున్నాను. కాంపిటీటివ్ పరీక్షలు రాసి ఉద్యోగంలో స్థిరపడ్డాను. నాన్న రెండు సంవత్సరాల క్రితం పోయారు. అప్పట్నుంచి అమ్మ ఆరోగ్యం దెబ్బతింది. మళ్లీ పెళ్లి ఆలోచన నాకు అంతగా లేదు. కానీ మా అమ్మ నన్ను మళ్లీ పెళ్లి చేసుకోమని పోరు పెడుతోంది. నా గురించే ఆవిడ దిగులంతా. మీ మీద నాకు సదభిప్రాయమే వుంది.

మీకు అభ్యంతరం లేకపోతే నాకు అభ్యంతరంలేదు. తుది నిర్ణయం మీదే'' అంది సుహాసిని.

చంద్రకాంత్ మాట్లాడలేదు. మౌనంగా కాసేపు కూర్చుని "మళ్లీ కలుద్దాం'' అని లేచి వెళ్లిపోయాడు.

★★★

మరో ఇరవై రోజులు గడిచిపోయాయి.

చంద్రకాంత్‌కు కోరుకున్న చోటుకి బదిలీ అయింది. వెళ్లే ముందు సుహాసినిని కలవలేదు. అందుకు సుహాసిని ఆశ్చర్యపడలేదు. ఇద్దరూ ఒకే పడవ మీద వున్నారు. అతడు తనను అర్థం చేసుకుంటాడా అనుకుంది.

కానీ అతని సహృదయత ఇంతేనా? ఐదు సంవత్సరాలు భార్యతో గడిపాడు. నాలుగేళ్ల కూతురుంది. కానీ తను మూడునెలలు భర్తతో గడిపింది. ఆ మాత్రం భరించలేడా? తను నచ్చింది అన్నాడు. తన ఉద్యోగం కూడా నచ్చే వుంటుంది. మరి ఇంక నచ్చనిది ఏమిటి? తన గతమా?

చంద్రకాంత్ సంకుచిత మనస్తత్వం అర్థమయింది. ప్రతి మగవాడు తను ఎలాగైనా ఉండనీ, తిరగనీ... తన భార్య మాత్రం పవిత్రంగా ఉండాలని కోరుకుంటాడు.

అది సగటు మగవాడి మనస్తత్వం. పైకి ఆధునికంగా ఉండే చంద్రకాంత్ విశాలభావాలు కలిగి వుంటాడనుకుంది. కానీ తన అంచనా తప్పింది. సుహాసినికి కోపం రాలేదు నవ్వు వచ్చింది.

తనకి నిజంగా పెళ్లికాలేదు. ఆ ఫొటోలో వున్నది మగవాడి డ్రెస్‌లో వున్న తన ప్రాణస్నేహితురాలు అరుణ. కాలేజీ ఫ్యాన్సీ డ్రెస్‌లో పోటీలలో తామిద్దరూ పెళ్లికొడుకు, పెళ్లికూతురు వేషం వేసారు. సరదాగా ఫొటో తీసుకున్నారు. చంద్రకాంత్ తనకు పెళ్లి అయింది, కూతురు అని చెప్పినప్పుడు తనకి సడెన్‌గా ఈ ఆలోచన వచ్చింది. అతని సంస్కారాన్ని పరీక్షించాలనుకుంది. అలాంటి కుసంస్కారి తనకు మాత్రం ఎందుకు? అసలు విషయం తెలిస్తే అతని హావభావాలు ఎలా వుంటాయి? ఎలాగైనా ఉండనీ. ఆ ఫొటో రహస్యం అతనికి చెప్పదలచుకోలేదు సుహాసిని.

